



రామచంద్రపురం మండలం హసన్‌బాదలో సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవంలో పాల్గొన్న మంత్రి సుభాష్

సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు



అమలాపురంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

అమలాపురంలో..



వార్తలు..6లో



మండపేటలో..

జిల్లా వ్యాప్తంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. కొన్ని ఆలయాల వద్ద అయితే భారీ క్యూలు వెలిశాయి. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎ.వేమవరం, ద్రాక్షారామ, మండపేట ఆలయాల్లో రద్దీ నెలకొంది.



ద్రాక్షారామ భీమేశ్వరుని ఆలయంలో క్యూలో భక్తులు

బాలబాలాజీకి ప్రత్యేక పూజలు





మామిడికుదురు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే వేద మంత్రోచ్ఛరణల మధ్య సుప్రభాత సేవ నిర్వహించి తొలి హారతి ఇచ్చారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిక్కిరిశాయి. దేవస్థానంలో నిర్వహించే వివిధ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా శనివారం ఒక్కరోజు రూ.1,66,466 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.


జొన్నాడ వద్ద ఫ్లైఓవర్‌ను అలా వదిలేశారు..

- నిర్లక్ష్యపు నీడలో జొన్నాడ ఫ్లైఓవర్
- ఎక్కడి పనులు అక్కడే
- కాంట్రాక్టు సంస్థ అలసత్వం..శాపం

ఆలమూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోంది. గత రెండు నెలలుగా ఒక ఇంచు కూడా పనులు ముందుకు సాగలేదు. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై స్వయాన కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ కాంట్రాక్ట్ సంస్థ కృతి అధికారులతో సమీక్ష చేసినప్పటికీ వారి తీరులో ఎటువంటి మార్పు కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. జొన్నాడ, రాజమహేంద్రవరం వద్ద 2023 జనవరిలో శంకుస్థాపనలు చేశారు. అయితే జొన్నాడ వద్ద పనులు ప్రారంభించి అదే ఏడాది ఏప్రిల్‌లో మొదలు పెట్టారు. అప్పటి నుంచి నత్తనడకగా పనులు సాగుతున్నాయి. సర్వీసులు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జొన్నాడ నాలుగు రోడ్ల జంక్షన్‌లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజమహేంద్రవరంలో నిర్మాణం పూర్తయి ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చినప్పటికీ ఇక్కడ మాత్రం పనులు ముందుకు సాగడం లేదు. రెండు నెలల క్రితం వరకు వర్షాల వల్ల పనులు చేయడానికి అడ్డంకిగా మారిందని వాదిస్తున్న కాంట్రాక్టర్ ఇప్పుడు వర్షాలు లేనప్పటికీ ఎందుకు చేయడం లేదో అర్థం కాని పరిస్థితి.



జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా భారీ గోతులు తీసి వదిలేసిన దృశ్యం



రివ్యూ చేసినా పరిస్థితిలో రాని మార్పు

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల ఆలస్యంపై కృతి కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, నేషనల్ హైవే అధికారులతో అక్టోబరు నెలలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ సమీక్ష చేసి పనుల ఆలస్యంపై ఆరా తీశారు. అయితే ముందుగా ఇబ్బందికరంగా ఉన్న సర్వీసు రోడ్లను నిర్మించి ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేస్తామని వర్షాల కారణంగా ఆలస్యమయిందని ఇకపై పనులు ఆగకుండా చేపట్టి 2025 మార్చి నాటికి ఫ్లైఓవర్ అందుబాటులోనికి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అయితే అప్పటి వరకు ఎంతో కొంత పని చేసే కాంట్రాక్టర్ ఆ తర్వాత మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విరాళాలు ధారాళంగా!



- సత్యదేవుడి ఆలయానికి భక్తుల విరాళాల వెల్లువ
- నిత్యాన్నదాన పథకానికి ఇప్పటిదాకా రూ.62 కోట్లు
- సత్రం గదుల డొనేషన్‌కు ముందుకొస్తున్న దాతలు

అన్నవరం సత్యదేవుడి ఆలయానికి ఏటేటా భక్తుల సంఖ్య లక్షల్లో పెరుగుతోంది. దీనికి అనుగుణంగా అనేక అన్నదానం, వసతి, సేవా కార్యక్రమాలను విస్తరించాల్సి వస్తోంది. దీనికి ప్రధానంగా దాతలే అండగా నిలుస్తున్నారు. కోట్లాది రూపాయల విరాళాలు అందిస్తూ తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. అన్నదానం పెద్దఎత్తున సాగడానికి, భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించే సత్రాలు, కల్యాణ మండపాలను నిర్మించి అందుబాటులోకి తెస్తున్నారు.

ప్రత్యేక కథనం 4లో

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

కె.గంగవరం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆకాంక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో శనివారం ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని కె.గంగవరం మండలం పామర్రు, కోటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరిగిన సభల్లో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు తక్షణం పరిష్కరించి మంచి ఫలితాల సాధన కోసం ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆధునిక టెక్నాలజీ కారణంగా చాలా మంది విద్యార్థులు చెడు మార్గంలో నడుస్తున్నారని, విద్యార్థుల నడవడిక పట్ల తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు గమనించి ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. బాలికలను ప్రేమ పేరుతో మోసగించేందుకు పాఠశాలల వద్ద కొందరు ఆకతాయిలు తిరుగుతారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారరో విషయాలను శ్రద్ధగా గమనించాలన్నారు. ప్రతి స్కూల్ లోను ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. రామ చంద్రపరం నియోజకవర్గంలో ఉన్న 18 మంది మహిళా పోలీసులను ఆయా స్కూళ్ల వద్ద పర్యవేక్షణ నిమిత్తం ఉంచి విద్యార్థుల ప్రవర్తన గమనించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాఠశాలల్లో 75 శాతం హాజరు ఉన్న విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చెప్పారు. ఈ సభలో డ్రగ్స్ వద్దు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం అంటూ స్థానిక ఎస్ఐ ఎస్‌.కె. జానీబాషా విద్యార్థులతో ప్రమాణం చేయించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉందామనే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తొలుత మంత్రి సరస్వతీదేవి, భరతమాత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ వైద్యుడు కాదా వెంకటరమణ, ఎంఈవో ఏ. నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఇదే విధంగా మండలంలోని గంగవరం, కుందూరు, శివల, సత్యవాడ, తదితర ఉన్నత పాఠశాలల్లోను, ప్రాథమిక పాఠశాలల్లోను మెగా పేరెంట్స్ మీటింగ్స్ నిర్వహించారు. తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సహపంక్తి భోజనాలు నిర్వహించారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

కలెక్టర్ మహేష్‌కుమార్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంతో పాటు పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం తప్పనిసరి అని కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ చెప్పారు. పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్‌కు ప్రధానోపాధ్యాయుడు కడలి ఆనందరామశ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ బి.కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రతీ నెల పాఠశాలలను సందర్శించి తమ పిల్లల ప్రగతిని పరిశీలించుకోవడంతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో ఏవిధంగా ఉంటున్నారో తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అవసరమైతే ఉపాధ్యాయులచే పిల్లలకు కౌన్సిలింగ్ ఇప్పించి సక్రమ మార్గంలో నడిచేలా మార్గ నిర్దేశం చేయాలన్నారు. విద్యార్థుల మానసిక స్థితిగతులను అంచనా వేసి బోధనా పద్ధతులను అవలంబించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కారాదు..

మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్‌లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధానికి నిర్వహించిన సదస్సులో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆధునిక సమాజంలో సోషల్ మీడియా, సైబర్‌క్రైమ్, యాంటీ డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల మత్తుకు బానిసలుగా మారవద్దని విద్యార్థులకు హితవు పలికారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆయా కుటుంబాల పరిస్థితి ఏవిధంగా మారిపోతుందో వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ముద్రించిన పోస్టర్లు, పాంప్లేట్లను అన్ని పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రదర్శిస్తున్నామన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సమక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులతో ఎస్పీ కృష్ణారావు మాదక ద్రవ్యాల నిరోధంపై చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెచ్చెట్టి చంద్రమౌళి, విద్యాకమిటీ చైర్మన్ వీరవెంకట సత్యనారాయణ, పట్టణ సీఐ పి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

‘నాలా నువ్వు కలెక్టర్ కావాలి’

విద్యార్థినితో కలెక్టర్ ముచ్చట



విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్

అంబాజీపేట, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు క్రమశిక్షణతో చదివి కలెక్టర్ కావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ఓ విద్యార్థికి సూచించారు. మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో భాగంగా అంబాజీపేట మండలం పెదపాలెం ప్రాథమిక పాఠశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్‌కు స్వాగతం చెప్పేందుకు నిల్చున్న ఓ చిన్నారితో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. ‘నీ పేరు ఏమిటి’ అంటూ ఆప్యాయంగా పలకరించారు. ‘నువ్వు పెద్దయ్యాక ఏమి అవుతావంటూ’ ప్రశ్నించారు. దీంతో ఆ చిన్నారి నవ్వుతుండగా నాలా కలెక్టర్ అవ్వాలని చెప్పారు. అనంతరం ఇతర విద్యార్థులతో మమేకమయ్యారు.

సఫాయి కర్మచారుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు

5లో

జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశన్



అన్నమయ్య కీర్తనలకు వన్నెలద్దీ..

4

నేడు నేదునూరి కృష్ణమూర్తి వర్ధంతి

భవితకు భరోసాగా ఉపకార వేతన పరీక్ష

నేడు జిల్లా వ్యాప్తంగా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ పరీక్ష

- పరీక్ష రాయనున్న 2,815 మంది విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

రాయవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరిస్థితులు అడ్డుపడుతుండటంతో చదువు కొనసాగించలేని విద్యార్థులకు ఆర్థిక సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తోంది కేంద్ర ప్రభుత్వం. ప్రతిభ ఉన్న పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్(ఎన్ఎంఎంఎస్) అర్హత పరీక్ష నిర్వహిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇప్పటికే ఎన్ఎంఎంఎస్ స్కాలర్ అర్హత పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 8న 2025-26 విద్యా సంవత్సరానికి గాను అర్హత పరీక్ష నిర్వహిస్తుంది.

ఏటా రూ.12 వేలు ఉపకార వేతనం

ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షలో ప్రతిభ కనబర్చి ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు కేంద్రం ఏడాదికి 12 వేల రూపాయల వంతున ఉపకార వేతనం అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి, 10వ తరగతితో పాటు ఇంటర్‌మీడియట్ రెండు సంవత్సరాలు పాటు మొత్తం నాలుగు సంవత్సరాలు ఉపకార వేతనం పొందుతారు. ఎంపికైన విద్యార్థులు టెన్త్ తర్వాత ఇంటర్ ప్రభుత్వ కళాశాలలో చదవాల్సి ఉంటుంది.



రాయవరంలో హాల్‌టిక్కెట్స్ అందిస్తున్న హెచ్‌ఎం

విద్యార్థులకు ఇప్పటికే శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ చదువులో ప్రతిభ కనబర్చే విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఇప్పటికే ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పరీక్ష కోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా లో ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్ష రాసేందుకు 2 వేల 815 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలో 3 పరీక్షా కేంద్రాలు, అమలాపురం డివిజన్ పరిధిలో 6 పరీక్షా కేంద్రాలు, కొత్తపేట డివిజన్ పరిధిలో 4 పరీక్షా కేంద్రాలు మొత్తం 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా తెలిపారు. పరీక్ష నిర్వహణ కోసం ఇప్పటికే సీఎస్, డీవోలను నియమించడంతో పాటు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. పరీక్షను పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు డీఈవో తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ప్రత్యేక కథనం

విరాళాలు.. ధారాళంగా


అన్నదానం సత్రంలో..


శ్రీ లలితా రైస్ వారు నిర్మించిన ప్రసాద తయారీ భవనం

- సత్యదేవుడి ఆలయానికి భక్తుల విరాళాల వెల్లువ
- నిత్యాన్నదాన పథకానికి ప్రారంభం నుంచి ఇప్పటికి 1.50 లక్షలమంది దాతల నుంచి రూ.62కోట్లు
- సత్రం గదుల డొనేషన్‌కు ముందుకొస్తున్న దాతలు
- దాతలకు ప్రత్యేక గుర్తింపుగా సిల్వర్, గోల్డ్, ప్లాటినం కార్డులు జారీ
- వీటి ద్వారా సదరు దాతకు ప్రత్యేక సౌకర్యాల కల్పన


దాతల సహకారంతో నిర్మించిన వసతి కోసం శివ సదన్.. రత్నగిరి డార్మిటరీ




విరాళాల కౌంటర్లు

(ఆంధ్రజ్యోతి- అన్నవరం)

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా.. భక్తితత్వానికి నిలయంగా.. ప్రశాంతతకు ఆలవాలంగా నిలుస్తోంది.. అన్నవరంలోని సత్యదేవుడి పుణ్య క్షేత్రం. రాష్ట్రంలో తిరుపతి తర్వాత ఆ స్థాయిలో ఖ్యాతి గడించిన ఆలయమిది. ఈ ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఆలయానికి హుండీలతోపాటు దర్శనాలు, వ్రతాలు, సత్రం గదులు, ప్రసాదం, ఆలయ పరిధిలో వివిధ షాపుల వేలం వంటి రూపాల్లో ఆదాయాలు వస్తుంటాయి. ఇదంతా ఒకెత్తు అయితే భక్తుల విరాళాలు ప్రత్యేకం. ఇక్కడికి వచ్చే చాలామంది స్వామికి తమ వంతుగా వివిధ రూపాల్లో విరాళాలు ఇస్తుంటారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు సౌకర్యాలనకు కానుకలతోపాటు దాతల దాతృత్వం కూడా ఎంతో ముఖ్యం. అసలు సత్యదేవుడికి ఎన్ని రూపాల్లో విరాళాలు వస్తుంటాయి. ఎంత వచ్చి ఉంటాయి. ఎన్నిరకాలుగా ఇవ్వొచ్చు... దాతలకు దేవస్థానం కల్పించే సౌకర్యాలు వంటి విశేషాలు తెలుసుకుందాం..

కొండపై ప్రత్యేక కౌంటర్లు

అన్నవరం సత్యదేవుడి ఆలయానికి ఎందరో దాతలు తమవంతు సాయమందిస్తూ ఉంటారు. అన్నదానం, గోసంరక్షణ ట్రస్టు, సత్రం గదులకు సంబంధించి దేవస్థానం తరఫున విరాళాలు స్వీకరిస్తుంటారు. వీటికి రత్నగిరిపై ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేశారు. అన్నదానానికి సంబంధించి మూడుచోట్ల కౌంటర్లు ఉన్నాయి. గోసంరక్షణ, సత్రం గదులకు కూడా ఏర్పాటు చేశారు. దాతలు వీటిని సంప్రదించి విరాళాలు ఇస్తుంటారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకం

అన్నవరం దేవస్థానంలో అధికంగా సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందిస్తుంటారు. ఈ పథకం 1987లో ప్రారంభం కాగా ఇప్పటివరకు రూ.62 కోట్లు విరాళాలుగా వచ్చాయి. వీటిపై వచ్చే వడ్డీతో ప్రతినిత్యం నిత్యాన్నదానం చేస్తుంటారు. ఇప్పటివరకు ఈ పథకంలో రూ.1116 నుంచి ఆపై విరాళాలు అందించిన దాతల సంఖ్య లక్షా 50 వేలమంది వరకు ఉన్నారు. వీటిపై ఏటా వడ్డీల రూపంలో రూ.4.5 కోట్లు సమకూరుతోంది. కేవలం ఈ వడ్డీతోనే సరాసరిన రోజుకు 4 వేలమందికి ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు. వీటిలో రూ.లక్షపైబడి విరాళమిచ్చిన వారికి మాత్రమే కొన్ని వెసులుబాట్లు కల్పిస్తారు. వీరికి మొదటి ఏడాదికి ఒకసారి ఉచితంగా సత్రం గది, ఉచితంగా వ్రతం చేసుకునే అవకాశం, కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కల్పిస్తున్నారు. తదుపరి ఏడాది నుంచి కేవలం ప్రత్యేక దర్శన సౌకర్యం మాత్రమే ఉంటుంది. ఈ నిధులు కేవలం అన్నదాన ట్రస్టుకు చెందుతాయి. ఈ పథకానికి సెక్షన్ 80జీ ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది. దీనికి రూ.500పైబడి విరాళం ఇవ్వొచ్చు. రూ.లక్షపైబడి డొనేషన్ చేసినవారి పేరు వారు సూచించిన రోజున అన్నదానం వద్ద బోర్డులో ప్రదర్శిస్తారు.

సత్రం గదులకు డొనేషన్లు

దేవస్థానంలో ప్రస్తుతం హరిహరసదన్, శివసదన్ కాటేజీలకు డోనార్ స్కీం అమలవుతోంది. హరిహరసదన్‌లో ఒక రూంకు డోనార్ రూ.5 లక్షలు, శివసదన్‌లో రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. వీరి పేరు వీరికి కేటాయించిన సత్రం గదిపై శాశ్వతంగా లిఖిస్తారు. గది డోనార్‌కు ఏడాదిలో 30రోజులపాటు దాతకుగానీ, దాత సిఫార్సు చేసిన వారికిగానీ ఉచితంగా పదేళ్లపాటు కొనసాగిస్తారు. వీరికి ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. దాత 15రోజులు ముందుగా దేవస్థానం సంబంధిత విభాగానికి ఈ సమాచారం చేరవేయాల్సి ఉంటుంది. అప్పటికప్పుడు వస్తే ఆలయంలో భక్తుల రద్దీని బట్టి ప్రాధాన్య క్రమంలో సత్రం గదులు కేటాయిస్తారు. ఈ విరాళాల ద్వారా వచ్చిన మొత్తం దేవస్థానం మెయిన్ అకౌంట్‌కు జమచేస్తారు. వ్యక్తిగత గెస్ట్‌హౌస్‌లు కూడా విరాళాల జాబితాలో ఉన్నాయి. కొండపై ఉన్న అంజనీ గెస్ట్‌హౌస్, రామరాజు నిలయం, పల్లవి గెస్ట్‌హౌస్, సీతానిలయం, సత్యనిలయం, సత్యకిరణ్‌నిలయం, సీతారామసదన్ గెస్ట్‌హౌస్ తదితర ఏడు గెస్ట్‌హౌస్‌లను దాతలు నిర్మించారు. వీరికి ఏడాదిలో 30 రోజులపాటు ఉచితంగా గెస్ట్‌హౌస్ కేటాయిస్తారు. నెలరోజుల తర్వాత కూడా రద్దీనిబట్టి ఈ దాతలు సిఫార్సు చేసినవాళ్లకి వీటిని ఇచ్చే అవకాశం ఉంది. దేవస్థానం పరిధిలోనే కేటాయింపు చేస్తారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు విరాళాలు

భక్తులు గోసంరక్షణ ట్రస్ట్‌కు కూడా విరాళాలు అందించవచ్చు. పదేళ్ల కిందట నెలకొల్పిన ఈ ట్రస్ట్ ద్వారా వచ్చే విరాళాలను గోవుల సంరక్షణ, దాణా తదితర వాటికి వినియోగిస్తుంటారు. ఇప్పటివరకు ఈ ట్రస్ట్‌కు రూ.1.57 కోట్లు విరాళాలుగా వచ్చాయి. దేవస్థానంలో 49 ఆవులు, 23 గిత్తలు, ఎద్దులు 4, పెయ్యిలు 21 ఉన్నాయి. విరాళమిస్తే ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.

స్వల్పంగానే అతిపెద్ద డోనార్లు

అన్నవరం దేవస్థానంలో రూ.కోటిపైబడి విరాళాలందించిన వారు స్వల్పంగానే ఉన్నారు. వీరిలో కాకినాడ తిమ్మాపురంలో కర్రి బామిరెడ్డి జమిందారు 45 ఎకరాల భూమిని విరాళంగా అందించారు. లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతలు మట్టే సత్యప్రసాద్ ప్రసాదం తయారీ భవనాన్ని రూ.4 కోట్లతో, స్వామి, అమ్మవార్లకు వజ్రకిరీటం, కర్ణాభరణాలు రూ.3 కోట్లతో, ఇంకా పలు వెండి వస్తువులు, గర్భాలయ బంగారు తాపడం పనులు కూడా చేపట్టారు. రూ.25 లక్షలతో సహస్ర దీపాలంకరణ మందిరం నిర్మించారు. లలిత రైస్ మరో ఎండీ మట్టే శ్రీనివాస్, సత్యశ్రీనివాస ఉచిత కల్యాణవేదికను రూ.4.5 కోట్లతో చేపట్టడంతోపాటు వంశపారంపర్యంగా స్వామివారి నివేదనకు అవసరమయ్యే బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. నిత్యం జరిగే పంచహారతులకు వెండి సామగ్రిని అందించారు. పారిశ్రామికవేత్త ఎంఎస్ రెడ్డి అంజనీ గెస్ట్‌హౌస్, ఉచిత కల్యాణమండపాలను నిర్మించారు. రాజమహేంద్రవరానికి చెందిన పెన్నాడ నాగమణి రూ.2 కోట్లతో ఉచిత డార్మెటరీ నిర్మించారు. అదేవిధంగా మరో ఐదుగురు దాతలు పలు గెస్ట్‌హౌస్‌లు నిర్మించారు.

విరాళాన్ని బట్టి కార్డులు

నిత్యాన్నదాన పథకానికి విరాళం అందించే దాతలకు గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో దేవస్థానం వారి విరాళాన్ని బట్టి పేర్లు కేటాయించింది. రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు దాతలుగా, రూ.10వేల నుంచి రూ.50 వేల వరకు పోషకులుగా, రూ.50 వేల నుంచి రూ.లక్షవరకు రాజపోషకులుగా, రూ.లక్ష పైబడి మహారాజపోషకులుగా పరిగణించారు. దీంతోపాటు దాతలకు వారిచ్చిన డొనేషన్ ఆధారంగా ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఇటీవల దేవస్థానం ప్రత్యేక కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. వీటిలో రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు విరాళం అందించిన వారికి సిల్వర్ కార్డు, రూ.10 లక్షల నుంచి రూ.కోటి విరాళమిచ్చిన వారికి గోల్డ్‌కార్డు, రూ.కోటి ఆపైన డొనేట్ చేసిన వారికి ప్లాటినం కార్డులను జారీ ప్రారంభించింది.

విరాళం అందించాలనుకుంటే..

ఆలయంలో స్వామివారికి విరాళం అందించాలనుకుంటే కొండపై సంబంధిత కౌంటర్‌లో సంప్రదించాలి. నగదు, చెక్కు, డిజిటల్ పేమెంట్ రూపాల్లో విరాళం ఇవ్వొచ్చు. నగదు అయితే రూ.49 వేల లోపు స్వీకరిస్తారు. ఆపైన ఎంత ఇచ్చినా తప్పనిసరిగా పాన్‌కార్డు ఇవ్వాలి. అన్నవరం దేవస్థానం వెబ్‌సైట్‌లోగానీ, యాప్‌గానీ విరాళాన్ని డిజిటల్ పేమెంట్ చేయొచ్చు. ఆన్‌లైన్‌లో పేమెంట్ చేసిన తర్వాత సంబంధిత పత్రాలతో దేవస్థానాన్ని సంప్రదించి తగిన సౌకర్యాలు పొందొచ్చు.

డోనార్ సెల్ ఏర్పాటు కలగానే..

అన్నవరం దేవస్థానంలో డోనార్ సెల్ ఏర్పాటు చేయాలని కొంతకాలంగా ప్రతిపాదనలు ఉన్నా అవి కలగానే మిగిలిపోతున్నాయి. సాధారణ దాతలకు దేవస్థానం తరఫున సౌకర్యాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి డోనార్ సెల్ ఏర్పాటు చేస్తే విరాళాల తదనంతర సౌకర్యాల కల్పనకు అటూఇటూ తిరగాల్సిన పని ఉండదని దాతలు కోరుతున్నారు.






లలితా రైస్ వారు నిర్మించిన శ్రీ సత్య శ్రీనివాస ఉచిత కల్యాణ వేదిక.. ఎంఎస్ రెడ్డి- అంజని ఉచిత వివాహ వేదిక.. రామరాజు అతిథి గృహం

ఆలయాలు... భక్తజన సంద్రం


తాటిపర్తిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం

తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనాలకు బారులు తీరిన భక్తులు


గొల్లప్రోలు మండలం తాటిపర్తి ఆలయంలో నిద్రిస్తున్న ఉపవాస దీక్ష చేసిన మహిళలు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి సందర్భంగా శనివారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లో స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తజనసంద్రమయ్యాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తాటిపర్తిలో స్వయంభూ వల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వర 87వ షష్ఠి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయం సమీపంలో ఉన్న పుట్టల వద్ద గుడ్లు, పాలు ఉంచి పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షతో ఉన్న మహిళలు ఆలయ ప్రాంగణంలోనే నిద్రించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు భారీ పోలీసుబందోస్తు నిర్వహించారు. మల్లవరంలోని స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఉదయం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి స్నానాలు జరిగాయి. స్వామికి మహారుద్రాభిషేకం, క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. సంతాన ప్రాప్తి కోసం వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఆలయాలకు చేరుకుని ఉపవాస దీక్ష కొనసాగిస్తున్నారు. ఉగ్రషష్ఠి మండపంలో నిద్రించారు.

కనుల పండువగా కల్యాణం

తాటిపర్తి, మల్లవరంలో స్వయంభూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిల కల్యాణం శనివారం రాత్రి కనుల పండువగా జరిగింది. తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.


బిక్కవోలులో వైభవంగా షష్ఠి వేడుకలు


అలంకారరూపంలో బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి వారు

బిక్కవోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున 1.20 గంటలకు స్వామివారి తీర్థపు బిందె సేవతో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి ఉత్సవాలను ప్రారంభించారు. తొలిపూజలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, కుమారుడు మనోజ్‌రెడ్డి పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అప్పటి నుంచి భక్తులకు స్వామి దర్శనాలు కల్పించారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. సంతానార్థులైన స్త్రీలు స్వామి పుట్టపై ఉంచిన నాగచీరలను ధరించి ఆలయం వెనుక నిద్రించారు. ఉదయం 8.10 గంటలకు స్వామివారిని మయూర వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఆలయ ఆవరణలో దొడ్డిపట్ల, మొగల్తూరు, ఉండ్రాజవరం, బిక్కవోలు వారు నిర్వహించిన బ్యాండు కచేరీలు కనువిందు చేశాయి. 4 నుంచి 5వరకూ కాల్చిన బాణసంచా భక్తులను ఆకట్టుకుంది. ఆలయంలో పూలు, పండ్ల డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం : మంత్రి

షష్ఠి సందర్భంగా స్వామివారికి మంత్రి వాసంశెట్టి సుభాష్ పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టెంపుల్ సర్క్యూట్ ప్రాజెక్టులో బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. స్వామిని దర్శించుకున్న ప్రముఖుల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, కేపీఆర్ సంస్థల డైరెక్టర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఎస్పీ నరసింహకిషోర్, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు ఉన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి సుభాష్

ఎ.వేమవరంలో ప్రత్యేక అభిషేకాలు

అమలాపురం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం ఎ.వేమవరంలో ప్రసిద్ధి నొందిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం తెల్లవారు జాము నుంచి ఆలయ అర్చకుడు చంద్రమౌళి సురేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయంలో స్వామివారికి పూలు, పడగలు సమర్పించేందుకు భక్తులు బారులు తీరారు. జనుపల్లిలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి పంచ కావిళ్లతో గ్రామస్తులు, అయ్యప్ప స్వాములు, భవానీలు, భక్తజనం తరలివెళ్లారు. ఎ.వేమవరంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచ కావిళ్లతో అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ కోంపెల్ల వెంకటశ్రీనివాస్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. నడిపూడి మెట్ల రాంజీ కాలనీలో పుట్ట ఆలయం వద్ద స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. చంద్రమౌళి వెంకటేశ్వరశర్మ, ఆకొండి శ్రీకృష్ణ ఆచార్య బ్రహ్మత్వంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయం వద్ద షష్ఠి తీర్థం వైభవంగా జరిగింది.


ఎ.వేమవరంలో సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం వద్ద క్యూలో భక్తులు

వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామివారి తిరువీధుల్లో 7 ప్రదక్షిణలు నిర్వహించుకుని స్వామిని దర్శించుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.31.68 లక్షలు లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

రూ.31.68 లక్షల ఆదాయం


వాడపల్లి వెంకన్న ఆలయంలో క్యూలైన్లో భక్తులు

అన్నమయ్య కీర్తనలకు వన్నెలద్ది..



నేడు వర్ధంతి

కర్నాటక సంగీతాన్ని సుసంపన్నం చేసిన సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి

(ఆంధ్రజ్యోతి- పిఠాపురం)

ఆయన సంగీత కచేరీలు మరుపురానివి.. ఆయన స్వరపరిచి ఆలపించిన కీర్తనలు వినసొంపైనవి.. సంగీత, కళాభిమానుల చెవుల్లో అవి ఇంకా వినబడుతూనే ఉన్నాయి. ఎందరో ఉద్దండుల మన్ననలు పొందిన ఆయనే ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసుడు, సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి. ఆదివారం నేదునూరి వర్ధంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మహారాజా ఎస్టేట్‌లో పనిచేస్తున్న శ్రీరామమూర్తి పంతులు, విజయలక్ష్మి దంపతులకు నేదునూరి కృష్ణమూర్తి 1927 అక్టోబరు 10న జన్మించారు. తన తల్లి, మేనమామల ద్వారా సంగీతంపై ఆసక్తి పెంచుకున్న ఆయన 1940లోనే విజయనగరంలోని మహారాజా మ్యూజికల్ కళాశాలలో వయోలిన్, సంగీతాన్ని నేర్చుకున్నారు. 1950 వరకూ పిఠాపురంలోనే నివసించిన ఆయన తర్వాత ఇక్కడ నుంచి వెళ్లి విశాఖపట్నంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. మద్రాసు మ్యూజిక్ అకాడమీలో ఐదు దశాబ్దాలకు పైగా సంగీత కచేరీలు నిర్వహించారు. తదనంతరం కంచికామకోటి పీఠం, తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ కనకదుర్గమ్మ వారి దేవస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా పనిచేశారు.

అన్నమాచార్య కీర్తనల్లతో ప్రాచుర్యం

దేశ, విదేశాల్లో నేదునూరి కృష్ణమూర్తి చేసిన అన్నమాచార్య సంకీర్తనలు మంచి ప్రాచుర్యం పొందాయి. అనేక అన్నమయ్య కృతులకు బాణీలు కట్టారు. నానాటి బ్రతుకు నాటకం కీర్తనకు నేదునూరి కట్టిన బాణీని ప్రముఖ గాయకురాలు ఎమ్ఎస్ సుబ్బలక్ష్మి ప్రశంసిస్తూ ఈ ఒక్క పాటకు బాణీ కట్టినందుకు మీకు సంగీత కళానిధి ఇవ్వొచ్చు అన్నారంటే ఆయన ప్రతిభ ఇట్టే అర్థమవుతుంది. వీటితో ఆయన స్వరపర్చిన కీర్తనల్లో దాశరథి శతకం పద్యాలు, రాగసుధరసాలతో భద్రాచల రామదాసు కీర్తనలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. నేదునూరి తొలుత విజయవాడ జీవీఆర్ ప్రభుత్వ సంగీత, నాట్యకళాశాల ప్రధాన అధ్యాపకుడిగా తదనంతరం సికింద్రాబాద్, విజయనగరం, తిరుపతి సంగీత కళాశాలల్లో పనిచేశారు. వెంకటేశ్వర, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో ఆర్ట్స్ విభాగం డీన్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఆల్‌ఇండియా రేడియో సంగీత విభాగం ఆడిషన్ బోర్డు సభ్యుడిగా వ్యవహరించారు. కొంతకాలం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గౌరవ ఆచార్యుడిగా ఉన్నారు.

అవార్డులు, పురస్కారాలు

నేదునూరికి పలు పురస్కారాలు, అవార్డులు లభించాయి. 1976లో చెన్నైలోని శ్రీకృష్ణ గానసభ సంగీత చూడామణి అవార్డుతో తొలుత సత్కరించింది. అప్పటినుంచి 2014 వరకూ 53కిపైగా పురస్కారాలు అందుకున్నారు. వీటిలో 1991లో మద్రాసు మ్యూజిక్ అకాడమీ నుంచి సంగీత కళానిధి, 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళానీరాజన పురస్కారాలు ప్రధానమైనవి. స్వరవిలాస్, నాద సుధానిధి, సంగీత విద్వన్మణి, నాదయోగి, సంగీత కళాభారతి తదితర 51కిపైగా అవార్డులు ఆయన్ను వరించాయి.

పిఠాపురంపై ఎనలేని మమకారం

నేదునూరి ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా పిఠాపురంపై మాత్రం మమకారం వీడలేదు. చిన్నతనంలో ఆయన కుటుంబం పిఠాపురంలోని కోటవారివీధి, ఆకొండివారి వీధిలో నివాసం ఉంది. ఆ వీధుల్లో నివసిస్తున్న వృద్ధుల్లో పలువురికి నేదునూరి కుటుంబంతో అవినావభావ సంబంధాలున్నాయి. జీవితచరమాంకంలోనూ అనారోగ్యంతో ఉన్నప్పటికీ మరణానికి నెలన్నర రోజుల ముందే పాదగయను కుటుంబసభ్యులతో కలిసి సందర్శించి పూజలు జరిపారు. పాదగయ అభివృద్ధికి లక్ష రూపాయలను విరాళంగానూ అందించారు. అనారోగ్యానికి గురయ్యే వరకూ నేదునూరి కీర్తనలను ఆలపిస్తూ.. స్వరపరుస్తూనే ఉన్నారు. నాదాసుధ తరంగిణి సంస్థ ద్వారా నాదయోగి ఆత్మకథ, 108 భద్రాచలం రామదాసు కీర్తనలు, భక్తిరస కీర్తనలు, 200కిపైగా అన్నమయ్య సంకీర్తనలు, 25 యోగా నారాయణ కీర్తనలను ఆయన స్వరపరిచారు. 87 ఏళ్ల వయస్సులో 2014, డిసెంబరు 8న విశాఖపట్టణంలో తుదిశ్వాస విడిచారు.

ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే తాజాగా క్రిస్మస్ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సామర్లకోట మీదుగా విశాఖ-సికింద్రాబాద్, బ్రహ్మపూర్-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే పీఆర్వో కార్యాలయంనుంచి రాత్రి సామర్లకోట రైల్వేస్టేషన్ ఉన్నతాధికారులకు ఉత్తర్వులు అందాయి.ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు డిసెంబరు 8 రాత్రి నుంచి డిసెంబరు 30 వరకూ విశాఖ-సికింద్రాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించనున్నాయి.

●07097 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ స్టేషన్ నుంచి సాయంత్రం 4.35గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు విశాఖ వెళ్తుంది. ఈ రైలు డిసెంబరు 8, 15, 22, 29 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి బయలుదేరుతుంది.

●079098 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రై లు విశాఖ నుంచి రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుంది. ఈ రైలు డిసెంబరు 9, 16, 23, 30 తేదీల్లో విశాఖ నుంచి బయలుదేరుతుంది

బ్రహ్మపూర్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లు

● 07028 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బ్రహ్మపూర్‌నుంచి సాయంత్రం 4.45 గంట లకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.35గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుంది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు డిసెంబరు 14, 21, 28 తేదీల్లో బ్రహ్మపూర్ నుంచి బయలుదేరుతుంది.

● 07027 నెంబరు ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి రాత్రి 8.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2.45గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. ఈ రైలు డిసెంబరు 8, 15, 22, 29 తేదీల్లో సికింద్రాబాద్‌నుంచి బయల్దేరుతుంది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, పలాస, ఇచ్ఛాపురం స్టేషన్లలో హాల్ట్ ఉన్నట్లు తెలిపారు.

షష్ఠి ఉత్సవాల్లో ఉద్రిక్తత

» ఇరువర్గీయులకు గాయాలు

ఆత్రేయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరంలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత దారితీసింది. తీర్థంలో రెండు సామాజిక వర్గాల యువకులు మాటామాటా పెరిగి ఘర్షణపడ్డారు. ఇది కాస్తా ఉద్రిక్తతకు దారితీయడంతో రెండువర్గాలకు చెందిన వారు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో గాయపడిన ఇరువర్గాలకు చెందిన వారిని 108 అంబులెన్స్ ద్వారా కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ ఎస్.రాము ఆధ్వర్యంలో సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పెద్దలతో శాంతి చర్చలు నిర్వహించారు. క్షతగాత్రులు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఇక్కడ కొబ్బరి కాయలు కొట్టరు..
కడతారు


పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం.. (ఇన్‌సెట్)లో శ్రీపాదశ్రీవల్లభుడు

» ఇక్కడ ఇదొక ప్రత్యేకత
» పిఠాపురంలో దత్తాత్రేయుడి ప్రథమ అవతారం శ్రీపాదశ్రీవల్లభుడి మహాసంస్థానం
» ఏడాదికి ఒక్కసారైనా వచ్చే మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు
» మరాఠీలకు ఇలవేల్పు శ్రీపాదుడు
» నేటినుంచి 14 వరకు సప్తాహాలు

ఆ ఆలయానికి వెళ్తే మనం ఆంధ్రాలో ఉన్నామా.. లేక.. వేరే రాష్ట్రంలో ఉన్నామా అనే భావన కలుగుతుంది. ఎందుకంటే అక్కడ మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, వెస్ట్‌బెంగాల్ వంటి రాష్ట్రాలనుంచి భక్తులే ఎక్కువగా కనిపిస్తారు. అదే పిఠాపురంలో దత్తాత్రేయుడి మొదటి అవతారమైన శ్రీపాదశ్రీవల్లభుడి మహాసంస్థానం.. తూర్పు, ఉత్తరాది భక్తులకు ఇది ప్రత్యేకమైన ఆలయం.. ముఖ్యంగా మహారాష్ట్ర భక్తులు మరీ ఎక్కువగా వస్తుంటారు. ఇక్కడ కొబ్బరికాయ కొట్టకుండా కట్టడం ప్రత్యేకత. ఇక్కడి ఔదంబర వృక్షానికి భక్తులు కొబ్బరికాయ కట్టి తమ కోర్కెను చెప్తే నెరవేరుతుందని వారి నమ్మకం. ఈనెల 8నుంచి 14 వరకు దత్త జయంతి సప్తాహ మహోత్సవాల సందర్భంగా ఈ ఆలయం విశేషాలపై ప్రత్యేక కథనం..

పిఠాపురం, డిసెంబరు 7: శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో ఉంది. ఇక్కడకు మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాలు, కర్నాటక నుంచి వచ్చే భక్తులు వస్తున్నారు. మరాఠీలు శ్రీపాదులు వారిని ఇలవేల్పుగా భావిస్తారు. దీంతో మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాల భక్తులు ఏటా ఒక్కసారైనా ఈ క్షేత్రానికి తరలివస్తారు. ఒకప్పుడు ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల్లో వీరే 90శాతానికి పైగా ఉండేవారు. ఇప్పుడు పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్‌కల్యాణ్ పోటీ చేయడం.. ఆయన డిప్యూటీ సీఎం కావడంతో ఇతర రాష్ట్రాలను ప్రాచుర్యం పొంది భక్తులు తరలివస్తున్నారు. ఏటా 20లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా. ఏటా గురువారాలు, చిత్తనక్షత్రం వచ్చే రోజులతోపాటు శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు, దత్త జయంతి ఉత్సవాలు, విజయదశమి, ఇతర పర్వదినాల సమయాల్లో భక్తుల రద్దీ ఉంటుంది. ఇక్కడ జరిగే పూజలు, గోపూజ, దత్త హోమం, మండలాభిషేకపూజ, శనిప్రదోష పూజ, నవగ్రహహోమం, లక్ష్మీగణపతిహోమం, చండీపారాయణ, చండీహోమం, మహా మృత్యుంజయహోమం, అనఘా దత్తవ్రతం, పల్లకీసేవల్లో భక్తులు పాలుపంచుకుంటారు.

కొబ్బరికాయ కడితే కోర్కె నెరవేరినట్లే..

అన్నిక్షేత్రాల్లో మాదిరిగా శ్రీపాదశ్రీవల్లభుడికి కొబ్బరికాయ కొట్టరు. శ్రీపాదుడు కొలువై ఉన్న ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలను కడతారు. కొబ్బరికాయలను కట్టి వేలాడతీసి ఔదంబర వృక్షం చుట్టూ ప్రదిక్షణాలు చేసి శ్రీపాదుడిని తమ కోర్కెలు నెరవేర్చమని కోరుకుంటారు. కోర్కెలు నెరవేరిన తర్వాత మళ్లీ వారు శ్రీపాదశ్రీవల్లభుడిని దర్శించుకుని పూజలుచేస్తారు. ఇక్కడ అభిషేకాలు, ఇతర పూజలు నిర్వహించిన భక్తులకు ప్రసాదంగా కొబ్బరికాయలనే ఇస్తారు. వీటిని భక్తులు ఇక్కడ కొట్టకుండా ఇంటికి పట్టుకెళ్లి శ్రీపాదశ్రీవల్లభుని స్మరించుకుని కొట్టి దాన్ని ప్రసాదంగా స్వీకరించాలని అర్చకులు పూజల సందర్భంగా చెబుతారు.

మాత్రం ఇక్కడ చెప్పరు. సామాన్యుల్లానే శ్రీపాదుని దర్శించుకుని పూజల్లో పాల్గొంటారు. కీలకహోదాల్లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, న్యాయమూర్తులు ఇదే పద్ధతిని పాటిస్తారు. కొందరు ఇక్కడ ఆలయ వసతిగృహాల్లోనే బస చేసి అన్న ప్రసాదాలను స్వీకరిస్తారు.

వారి విరాళాలే

ఆలయానికి వచ్చే విరాళాలు అధికశాతం మహారాష్ట్ర, ఉత్తరాది భక్తుల నుంచే వస్తున్నాయి. మహారాష్ట్ర భక్తులు తమ సంపాదనలో కొంతభాగాన్ని పక్కకు తీసి ఇక్కడకు వచ్చినప్పుడు విరాళంగా అందజేస్తారు. ఇక్కడ నిర్మించిన భవనాలు, ఇతర సౌకర్యాల కల్పనకు అందిన విరాళాల్లో వీరిదే సింహభాగం. భక్తులకు ఆలయప్రాంగణంలోనే ఉచిత వసతి ఉంది.


శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలు కదుతున్న భక్తులు


పూజల్లో పాల్గొన్న మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల భక్తులు

నమ్మకమే నడిపిస్తుంది

భక్తులకు శ్రీపాదశ్రీవల్లభుడిపై ఉన్న నమ్మకమే ఇటువైపు నడిపిస్తుందని మహారాష్ట్ర, కర్నాటక, గోవా, ఉత్తరాది తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు చెబుతున్నారు.ఈ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ఎంత ఉన్నతస్థాయిలో ఉన్న వారైనా తమ హోదాను

కోర్కెలు నెరవేరతాయని నమ్మకం

-నాగాభట్ల రాంబాబు, అర్చకులు



శ్రీపాదశ్రీవల్లభునికి నారీకేళ అర్పణ చేస్తే కోర్కెలు నెరవేరతాయని, మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ఔదంబర వృక్షానికి నారీకేళం కడతారు. అనుకున్న కోర్కెలు నెరవేరిన తర్వాత ఇక్కడకు మళ్లీ వచ్చి స్వామికి జరిగే పూజల్లో, అన్నదానాల్లో పాలుపంచుకుంటారు. శతాబ్ధాలుగా నారీకేళాన్ని కట్టే పద్ధతి ఇక్కడ ఆచారంగా ఉంది.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

-ఆర్.సౌజన్య, కార్యనిర్వహణాధికారి, శ్రీపాదశ్రీవల్లభ సంస్థానం

మహారాష్ట్ర, కర్నాటక, ఉత్తరాది, ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వస్తున్నారు. వీరందరికీ ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. కొబ్బరికాయలను ఔదంబర వృక్షానికి కట్టడం ఇక్కడ ఆచారంగా వస్తోంది. ఇందుకు అనుగుణంగా భక్తులకు కొబ్బరికాయలను అందుబాటులో ఉంచుతున్నాం. దేవస్థానం కౌంటర్ ద్వారా విక్రయిస్తున్నాం.



నేటి నుంచి దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు

పిఠాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన పిఠాపురం పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో ఆదివారంనుంచి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14వరకూ జరిగే ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దేశంలోని వివిధప్రాంతాలనుంచి భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు అధికంగా తరలివస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు విస్తృతఏర్పాట్లు చేశారు. తొలిరోజు ఆదివారం నుంచి 14వ తేదీ దత్తజయంతి వరకూ ప్రతి రోజూ మహాగణపతిపూజ, కలశ స్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మాలకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, హారతులు, స్వామికి పల్లకీసేవ జరుగుతాయి.

రోజువారీ కార్యక్రమాలు..

ఆదివారం ఉదయం దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు సర్వపుష్పపూజ, 9న లక్షబిల్వార్చన, 10న సహస్ర చామంతి పూజ, 11న లక్ష తులసి అర్చన, 12న సహస్ర లిల్లీ పుష్పపూజ, 13న గులాబి అర్చన, సంపెంగ పుష్పపూజ, 14న పూలంగిసేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. దత్తజయంతి రోజు సాయంత్రం దత్తాత్రేయస్వామి రథోత్సవం నిర్వహిస్తారు. దత్తజయంతి సప్తాహ మహోత్సవాల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, ఉభయ తెలుగురాష్ట్రాలు, కర్నాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. మహోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు.

సఫాయి కర్మచారుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు

» జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశన్



అమలాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఫాయి కర్మచారుల అభ్యున్నతికోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని జాతీయ కమిషన్ ఛైర్మన్ ఎం. వెంకటేశన్ అన్నారు. ఆయా పథకాల ద్వారా వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి జీవనోపాధుల కల్పనకు కృషి చేయాల్సి బాధ్యత అధికారులకు ఉందన్నారు. కలెక్టరేట్‌లో శనివారం పంచాయతీ రాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య, బ్యాంకింగ్, విద్య, కార్మిక, పోలీసు అధికారులతోపాటు సఫాయి కర్మచారి కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ సఫాయి కర్మచారులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చిట్టచివరి లబ్ధిదారుడికి సైతం సంక్షేమ పథకాల లబ్ధి చేరేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. సఫాయి కర్మచారి కార్మికుల పరిస్థితులను జాతీయస్థాయిలో కమిషనర్ పరిశోధించి కేంద్ర ప్రభుత్వానికి పలు సిఫార్సులు చేయనున్నట్టు వెల్లడించారు. అసమానతలు లేకుండా సఫాయి కార్మికులు అన్నివిధాలా ఎదిగేలా సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో కూడిన పనిముట్లు అందించాలన్నారు. కర్మచారీ కార్మికులకు పీఎంఏవై, టిడ్కో పథకాల ద్వారా గృహాలు మంజూరు చేయాలని సూచించారు. సెప్టిక్ ట్యాంకు వాహనాలు సమకూర్చిన వారికి లిక్విడ్ వేస్ట్ అన్‌లోడింగ్‌కోసం ట్రీట్మెంట్ ప్లాంట్లను రాబోయే రెండు నెలల్లో అందుబాటులోకి తేవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పారిశుధ్య పనులు చేసేవారి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వారికి కనీస వేతనాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను కమిషన్ ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
పారదర్శకంగా నిర్వహించాలి

» కాకినాడ జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న జరిగే ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి ఏఆర్వో, కాకినాడ జేసీ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక దశ ఓట్ల లెక్కింపు, డీటెయిల్డ్ కౌంటింగ్, రిజెక్టెడ్, డౌట్‌ఫుల్ ఓట్లు, కౌంటింగ్ ఏజెంట్లు వంటి ఇతర అంశాలపై కౌంటింగ్ అబ్జర్వర్లు, సూపర్‌వైజర్లు ఓట్ల లెక్కింపు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5న తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం సంబంధించిన పోలింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. ఈ పోలింగ్ ప్రక్రియలో 15,490 ఓట్లు నమోదయ్యాయన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో భద్రపరిచారన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం 6గంటలకే కేంద్రానికి చేరుకోవాలన్నారు. 14 టేబుల్స్‌పై 9రౌండ్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపులో ఎలాంటి గందరగోళ పరిస్థితులు నెలకొనకుండా లెక్కింపు ప్రక్రియ అంతా పారదర్శకంగా, సజావుగా జరిగేందుకు కౌంటింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. తొలిదశలో ప్రాథమిక ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం డిటెయిల్డ్ కౌంటింగ్ జరుగుతుందన్నారు. లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక దశ ఓట్ల లెక్కింపు, డిటెయిల్డ్ కౌంటింగ్, రిజెక్టెడ్, డౌట్‌ఫుల్ ఓట్లు, కౌంటింగ్ ఏజెంట్లు విధులు వంటి ఇతర అంశాలపై కేఎస్‌ఈజెడ్ ఎస్డీసీ రామలక్ష్మి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణ కార్యక్రమంలో కౌంటింగ్ అబ్జర్వర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గొల్లప్రోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో శనివారం జరిగిన గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మరణించాడు. గొల్లప్రోలు పట్టణంలోని దేవీనగరం ప్రాంతానికి చెందిన చేదులూరి పద్మరాజు అలియాస్ చంటబ్బాయి(58) కూలీ పని నిమిత్తం సైకిల్‌పై వెళ్తుండగా బైపాస్‌రోడ్డులో తాటిపర్తి పుంతరోడ్డు జంక్షన్ వద్ద కత్తిపూడి నుంచి పిఠాపురం వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చేదులూరి పద్మరాజు

కాకినాడలో ముగిసిన ప్లాస్టిక్ సర్జరీ సదస్సు

» తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది వైద్యులు
» కొత్త పరిశోధనలు, సర్జరీలకు శ్రీకారం




వైద్యసదస్సులో పాల్గొన్న వైద్యనిపుణులు.. సదస్సు ముగింపులో మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ నరసింహం

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్, రీకనస్ట్రక్టివ్ అండ్ అస్తటిక్ సర్జన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా (ఏపీఆర్ఏఎస్‌సీఏపీఎన్)-2024 ఆధ్వర్యంలో కాకినాడలో మూడురోజులుగా జరుగుతున్న 21వ యాన్యువల్ సదస్సు శనివారం ముగిసింది. ముగింపు వేడుకల్లో ముఖ్యఅతిథులుగా డీఎంఈ, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం, ఏపీ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ పీవీ సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం మాట్లాడుతూ వైద్య సదస్సులు, సెమినార్లలో పాల్గొనడం ద్వారా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వైద్యులు వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఈ సదస్సుల ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవడం, మనం నేర్చుకున్న విషయాలను గ్రూపులో ఒకరికొకరు చర్చించుకోవడంతో కొత్త ఆవిష్కరణలకు వీలుంటుందన్నారు. ఈనెల 5న కెడావర్ శస్త్ర చికిత్స, ఫిల్లర్స్, బొటాక్స్, థ్రెడ్ లిఫ్ట్ తదితర వాటిపై ప్రదర్శన, డిమానిస్ట్రేషన్, 6, 7 తేదీల్లో ప్లాస్టిక్ సర్జరీల్లో వస్తున్న కొత్త పోకడలు, నూతన ఆవిష్కరణలపై సైంటిఫిక్ సెషన్లు నిర్వహించామని ఏపీఆర్ఏఎస్‌సీఓఎన్ అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జన్ హెచ్‌వోడీ డాక్టర్ బి.రత్నభూషన్ తెలిపారు. ఈ సదస్సులో దేశంలో ఉన్న నిష్ణాతులైన ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు హాజరై లైవ్‌గా మృతదేహాలపై శస్త్రచికిత్సలు నిర్వహించి అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్ఏఎస్‌సీఓఎన్ ప్యాట్రిన్ డాక్టర్ కె.విష్ణుమూర్తి, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.ప్రవీణ, కార్యదర్శి డాక్టర్ ఎన్.రాంబాబు, ఏపీ, తెలంగాణాకు చెందిన ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు, 300మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ సెజ్ ద్వారా యనమలకు
ఆయాచిత లబ్ధి: వైసీపీ

సర్పవరం జంక్షన్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్‌ఈజెడ్‌కు మొదటిగా భూమి ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసిచ్చింది అప్పటి స్థానిక ఎమ్మెల్యే యనమల రామకృష్ణుడని, సెజ్ ద్వారా యనమల ఆయాచిత లబ్ధి పొంది రైతులను మోసం చేశారని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా విమర్శించారు. శనివారం వైద్యనగర్‌లో వైసీపీ జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ వంగా గీతతోపాటు కొత్తపల్లి మండలం తొండంగి మండలానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. సెజ్ కోసం సేకరించిన భూములను రైతులకు తిరిగి వెనక్కి ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఏరువాక పేరుతో రైతుల భూములు వెనక్కి ఇచ్చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, తర్వాత మాటతప్పి రైతులపై అక్రమ కేసులు, నిర్బంధాలతో వేధింపులకు గురి చేసి భూములను వెనక్కి లాక్కున్నారని విమర్శించారు. రైతులు దాడిశెట్టి నారాయణస్వామి, ప్రసాదరెడ్డి, సుబ్బిరెడ్డి, చింతా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వమిచ్చిన డబ్బులు తీసుకోకుండా కోర్టులో కేసులు వేశామన్నారు. ఈ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేవీ రావు, జీఎంఆర్‌లు భూములు తీసుకుని బ్యాంకులో తనకాపెట్టి రుణాలు తీసుకుని, ఆ డబ్బుతో భూములు కొనుగోలు చేసి వ్యాపారం చేశారని ఆరోపించారు.

ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు 18 మంది ఎంపిక


ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేరళలోని కాలికట్‌లో ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకూ జరిగే ఇంటర్ యూనివర్శిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు 18 మంది ఎంపికయ్యారని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. కళాశాల క్రీడామైదానంలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు శనివారంతో ముగిశాయి. పోటీల్లో మంచి ప్రతిభ చూపిన 18 మంది క్రీడాకారులను కాలికట్‌లో జరిగే ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపిక చేశారు. అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో కాకినాడ ఐడియల్ కాలేజ్ ప్రథమ, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ద్వితీయ, రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తృతీయ, కొయ్యలగూడెం ప్రకాష్ కళాశాల నాలుగో స్థానంలోని నిలిచినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

వాడపాలెంలో ఓ ఇంట్లో చోరీ

» రూ.5లక్షల నగదు, ఐదు కాసుల బంగారం అపహరణ



కొత్తపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం వాడపాలెంలో ఇంట్లో ఎవ్వరి లేని సమయంలో చోరీకి పాల్పడి నగదు, బంగారు వస్తువులు గుర్తుతెలియని ఆగంతకులు దోచుకుపోయిన్నట్లు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మండల పరిధి వాడపాలెం గ్రామానికి చెందిన శ్రీకాకోళపు సుమన్ తన తల్లితో కలిసి రాజోలు మండలం పొదలాడలో బంధువుల ఇంటికి శుభకార్యక్రమానికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి చేరుకున్నారు. బీరువా తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి చూసేసరికి బీరువాలో ఉంచిన రూ.5లక్షల నగదు, 5కాసుల బంగారం మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ సురేంద్ర సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని అమలాపురం నుంచి క్లూస్‌టీమ్, పోలీసుల జాగిలాలను రప్పించారు. దీనిపై సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

భూకంపం జోన్‌లో
పోలవరం

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు భూకంపం జోన్‌లో ఉందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థల్లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో గోదావరి పరీవాహక ప్రాంతాల్లోనే భూకంపం నమోదైందన్నారు. భూకంపాలు ఎప్పుడు వస్తాయో, ఎక్కడ వస్తాయో ఊహించలేమన్నారు. గోదావరి పరీవాహకప్రాంతం భూకంపం జోన్ -3లో ఉందని చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వం గైట్ బండ్ నిర్మాణాన్ని మేఘా కంపెనీకి అప్పగించారని ఆ కంపెనీ నాణ్యత పాటించకపోవడంతో గైట్ బండ్ కొట్టుకుపోయిందన్నారు. మళ్లీ అదే కంపెనీకి అప్పగించడం అభ్యంతరకరమన్నారు. భూకంపాలను తట్టుకుని నిలబడాలంటే డబుల్ డయాఫ్రంవాల్ తప్పకనిర్మించాలన్నారు.

ప్రాథమిక పాఠశాలకు బీరువా వితరణ
పి.గన్నవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మానేపల్లి శివారు శివాయిలంక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో కొమరాడకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ అడ్డాల దుర్గారావు రూ.10వేలు విలువైన ఇనుప బీరువాను అందించారు. అనంతరం దాతను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

ఈదరాడ విద్యార్థుల ప్రతిభ
మామిడికుదురు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో జిల్లాస్థాయిలో జరిగిన ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీల్లో ఈదరాడకు చెందిన విద్యార్థులు లంకపల్లి గణేష్‌చరణ్, యెరుబండి శ్రీపాల ముకేష్‌లు తృతీయస్థానం సాధించి సైకిళ్లనుబహుమతిగా గెలుపొందినట్టు హెచ్ఎం జి.సాయిబాబా తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం అభినందించారు.

భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుదాం





అమలాపురం: కామనగరువులో మాట్లాడుతున్న జేసీ నిషాంతి, మలికిపురం: కేశనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ, పి.గన్నవరం: గంటిపెదపూడి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

- జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి
- మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు

అమలాపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కామనగరువు అప్పనపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ ఆత్మీయ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పాల్గొన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. సమావేశంలో ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సుందరీకరణ
అయినవిల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో శనివారం మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆత్మీయ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలను సుందరీకరించారు. విద్యార్థుల ప్రోగ్రెస్‌ను తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థుల తల్లులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. శానపల్లిలంక జిల్లాపరిషత్ హైస్కూలులో జరిగిన సమావేశంలో రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి పాల్గొన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి
మామిడికుదురు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్యాభ్యాసంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబులు పేర్కొన్నారు. మండలంలోని 58 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, 12 ఉన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను శనివారం ఘనంగా జరిపారు. మామిడికుదురు హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూలులో నిర్వహించిన ఆటల పోటీల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవోలు, నాయకులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి
మలికిపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరూ నైతిక విలువల పెంపునకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం కేశనపల్లి జిల్లాపరిషత్ హైస్కూలులో జరిగిన మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో ఆయనమాట్లాడారు. గత పాలకులు విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుందన్నారు. సమావేశంలో సర్పంచ్ యెనుముల నాగు, గుండుబోగుల పెద్దకాపు, అడబాల సత్యనారాయణ, అడబాల సాయిబాబుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. మండలంలో పలు జిల్లాపరిషత్ హైస్కూళ్లలో మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పాఠశాలల్లో సాంస్కృతిక ప్రదర్శనలు
అంతర్వేది, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలోని 78ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయులు కలిసి మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించినట్టు ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సఖినేటిపల్లి, మోరి, అంతర్వేది, పలు ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యాపరమైన అంశాలపై చర్చించారు. పోలిస్టిక్ ప్రోగెస్‌కార్డు (సమగ ప్రగతిపత్రం) నివేదికలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మోరి హైస్కూలులో ఒక ఉపాధ్యాయుడు జ్యోతి దీపారాధన కుందెను పాఠశాలకు బహూకరించారు. ఆయా కార్యక్రమాల్లో సమగ్రశిక్ష సీఎంవో బి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో(ఎఫ్ఏసీ) కె.సూర్యనారాయణ, మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి అలివేలుగంగాత్రివేణి, టీడీపీ మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ
ఉప్పలగుప్తం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల నిర్వహణలో జాతీయ గుర్తింపు పొందిన గొల్లవిల్లి హైస్కూల్ క్రీడాప్రాంగణంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొని డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వద్దంటూ విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. భీమనపల్లి, చల్లపల్లి, గోపవరం పాఠశాలల్లో సమావేశాలు జరిగాయి. మండల ప్రత్యేక అధికారి షంషే, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, హెచ్ఎంలు లంక రాణి, నూకల సత్యనారాయణ, గరిమెళ్ల స్వామిప్రసాద్, పీఎంసీ చైర్మన్లు వాలా సత్యనారాయణ, గుర్లింక చిన్నా తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమ లక్ష్యాని వివరించిన టీచర్స్
కాట్రేనికోన, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు పోలిశెట్టి లక్ష్మీపార్వతి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమ లక్ష్యాన్ని ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం అక్కిరాజు శేషరాజు, సర్పంచ్ చెల్లి సురేష్, పీఎంసీ చైర్మన్ పోలిశెట్టి వెంకటరాజు, వైస్ చైర్మన్ మోర్త శ్రీనివాసవర్మ, మాజీ సర్పంచ్ త్సవటపల్లి నారాయణస్వామి, నంద్యాల వెంకన్నబాబు, గుత్తుల బుజ్జి, బాలూయాదవ్, యేడిద బాబూరావు, మొల్లేటి శ్రీహరి, సలాది నానాజీ, వూటుకూరి నాగభూషణం, చిట్టూరి వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు.

క్రమశి క్షణతో విద్యనభ్యసించాలి
ముమ్మిడివరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యాబుద్ధుల విషయంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.మురళీకృష్ణ, ఎంపీడీవో తాడి వెంకటాచార్యులు పేర్కొన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని 66ప్రాథమిక, 3ప్రాథమికోన్నత, 9జడ్పీ హైస్కూళ్లు, గురుకుల పాఠశాలల్లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశాల్లో వారు మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగి ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు బొజ్జా రమణశ్రీ, ఆర్.ఉదయభాస్కరరావు, పాఠశాలల హెచ్ఎంలు, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సీహెచ్ పరిమళ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు థగ్‌ఆఫ్‌వార్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సీహెచ్ గున్నేపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ భోగిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, సర్పంచ్ గొలకోటి దొరబాబు, యాళ్ల ఉదయ్, గొలకోటి సాయిబాబు, తాతాజీ తదితరులు మాట్లాడారు.

ఉత్సాహంగా, ఉల్లాసంగా
అల్లవరం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): గోడి బాలురు, బాలికల గురుకుల కళాశాలలు, హైస్కూల్స్, యూపీ ప్రాథమిక పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే కార్యక్రమాలు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగాయి. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తానని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెం దుకూరి సత్తిబాబురాజు చెప్పారు. గోడి గురుకుల కళాశాలలో రూ.30లక్షలు సొంత నిధులతో టాయిలెట్లు, మెరక చేయుట, డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పరిచిన దెందుకూరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమాలలో సర్పంచ్ తోట శ్రీదేవినరసింహారావు, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, ఎస్.కిరణ్మయి, చైర్మన్లు బీర భరత్‌కుమార్, నాగదుర్గ, ఎంపీటీసీ కాండ్రేగుల వాణిఅచ్యుతాంబ పాల్గొన్నారు. అల్లవరం, ఓడలరేవు, బోడసకుర్రు, దేవగుప్తంహైస్కూల్స్‌లో జరిగిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్, ఎంఈవో కిరణ్‌బాబు, ఎస్ఐ జి.హరీష్‌కుమార్, హెచ్ఎంలు ఎన్.వెంకటేశ్వరరావు, సుభాషిని, మౌనిక పాల్గొన్నారు.

విద్యావస్థలో విప్లవాత్మక మార్పులు
పి.గన్నవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. గంటిపెదపూడి హైస్కూల్లో జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. గన్నవరంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో కె.హెలీనా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 69ప్రాథమిక పాఠశాలల్లో, 3ప్రాథమికోన్నత పాఠశాలల్లో, 13 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్ సమావేశాలు జరిగాయన్నారు. తహశీల్దార్ పి.శ్రీపల్లివి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎంఈవో-2 సీహెచ్ వీరభద్రానందం, ఉపాధ్యాయులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో.. అవగాహన కార్యక్రమం
పి.గన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశంలో ఎస్ఐ బి.శివకృష్ణ డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డ్రగ్స్ మిమ్మల్నే కాదు...మీ కుటుంబాన్ని కూడా నాశనం చేస్తుంది, మత్తులో పిల్లలపై అఘాయిత్యాలు, మీ పిల్లల్ని బాల్యంలోనే చిదిమేస్తున్న డ్రగ్స్‌కి నో చెప్పండి అనే నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు.

విజయవంతంగా మెగా మీటింగ్స్
రాజోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం విజయవంతంగా నిర్వహించామని ఎంఈవో ఎస్.మనోహరం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలతో పాఠశాలల స్థితిగతులు, అక్కడున్న మౌలిక సదుపాయాలు విద్యార్థుల తల్లిదండ్రులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. శివకోటిలో 18 ఎకరాల కాలనీలో ఆంధ్రప్రదేశ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.లలితకుమారి, సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీ ఉండ్రు సూర్యారావు, విద్యాకమిటీ చైర్మన్లు, సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంబీఏ టాపర్‌గా శ్రీలక్ష్మి



అమలాపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి గ్రామానికి చెందిన అడపా శ్రీలక్ష్మి ఎంబీఏ యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి గోల్డ్‌మెడల్ అందుకుంది. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అడపా వీరవెంకటసత్యసూర్యనారాయణ (బాబులు)-కాశీఅన్నపూర్ణ దంపతుల కుమార్తె అయిన శ్రీలక్ష్మి గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. 86.25శాతం మార్కులు సాధించి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన శ్రీలక్ష్మికి విజ్ఞాన్ యూనివర్శిటీలో శనివారం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ లావు రత్తయ్య స్వర్ణ పతకం అందించారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
అంబాజీపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ రుద్రరాజు భీమారాజు సూచించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ఓడలరేవులో నేడు యాదవ ఆత్మీయ సమావేశం
అల్లవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అమలాపురం నియోజకవర్గ యాదవ ఆత్మీయ సమావేశం ఓడలరేవు ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరుగుతుందని నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కైల శోభన్ బాబు, సోమాని వెంకటరమణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవం





అంబాజీపేట: మాచవరంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి , అంతర్వేది: కేశవదాసుపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ముమ్మిడివరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి-అమ్మవార్లు

అమలాపురంటౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ప్రసిద్ధిగాంచిన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు శనివారం తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు జాతీయ రహదారిపై బారులు తీరారు. శుక్రవారం అర్ధరాత్రి 1.45 గంటలకు స్వామివారి దివ్య కల్యాణాన్ని అమ్ము అన్నాజీ సోదరులు నిర్వహించారు. స్థానిక యేడిద సత్యనారాయణ కళా మందిరంలో నిర్వహించిన స్వామివారి కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. చంద్రమౌళి వెంకటసత్య సూర్యనారాయణ అర్చక బృందం ఆధ్వర్యంలో రెండు గంటల పాటు కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయం వద్ద షష్ఠి తీర్థం అత్యంత వైభవంగా జరిగింది.దేవస్థానం ఈవోలు ఆర్.శ్రీనివాస్, కోనేటి కార్తీక ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. సాయంత్రం స్వామి-అమ్మవార్లకు పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా రంగాపురంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఎన్టీ ఆర్ మార్గ్‌లోని శ్రీపూర్ణపుష్కలాంబ సహిత అయ్యప్ప స్వామి ఆలయం వద్ద షష్ఠి తీర్థం నిర్వహించారు. బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని చింతా అత్తిలింగం-వీరభద్రమణి దంపతులు కల్యాణకర్తలుగా అంకం శ్రీనివాసరావు, గుమ్మిడి సద్గురుసత్యనారాయణ ఆచార్య బ్రహ్మత్వంలో జరిపించారు. ఆలయం వద్ద షష్ఠి తీర్థం జరిగింది. కార్యక్రమంలో చింతా శంకరమూర్తి, కొండా చంటి, కటకం చలపతి సిద్ధాంతి, చింతా మోహన్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పువ్వులు, పడగలు సమర్పణ
ముమ్మిడివరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పవిత్ర నదీ జలాల్లో స్నానాలు ఆచరించి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. స్వామివారికి పువ్వులు, పడగలు, పండ్లు, పాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి-అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపించారు. శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అర్చకులు కొండవీటి రాంబాబుశర్మ, ఆదిత్య శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలో గేదెల్లంక, క్రాపచింతలపూడితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి.

వేకువజాము నుంచి పుణ్యస్నానాలు
అయినవిల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని పువ్వులు, పడగలు సమర్పించారు. కొండుకుదురులోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, ముక్తేశ్వరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

ఆలయాలు భక్తులతో కిటకిట
మామిడికుదురు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): షష్ఠి ఉత్సవాలను మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పెదపట్నం, అప్పనపల్లి, మామిడికుదురు, పాశర్లపూడిలంక, బి.దొడ్డవరం, ఆదుర్రు, ఈదరాడ, మొగలికుదురులలో గల సుబ్రహ్మణ్యుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదుర్రు, పెదపట్నం గ్రామాల్లో జరిగిన షష్ఠి తీర్థానికి భక్తులు ఇతర ప్రాంతాల నుంచి తరలివెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు
మలికిపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో షష్ఠి తీర్థ మహోత్సవాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. తూర్పుపాలెం, కేశనపల్లి, బట్టేల్లంక, రామరాజులంక, మోరిపోడు, మోరి గ్రామాల్లో షష్ఠి తిరునాళ్లు ఘనంగా జరిగాయి.



ఐ.పోలవరం: గుత్తేనదీవిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

కోలాటం, భజనా కాలక్షేపాలు
అంతర్వేది, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం క్షేత్ర పాలకుని ఆలయానికి ఆనుకుని వెలసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అంతర్వేది చెరువుగట్టు వద్ద, కేశవదాసుపాలెం హైస్కూలు వద్ద వెలసి ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. శనివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద కోలాటం, భజనా కాలక్షేపాలునిర్వహించారు.

సీఐ నేతృత్వంలో బందోబస్తు
యానాం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): యానాంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం వేకువజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించున్నారు. ఈసందర్భంగా భక్తులు పూలు, పడగలు స్వామివారికి సమర్పించి పూజలు నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆలయ కార్యనిర్వహకాధికారి ఖండవిల్లి రామకృష్ణ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ షణ్ముగం నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు.

మాచవరంలో వేడుకలు
అంబాజీపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మాచవరంలో కొలువుతీరిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి షష్ఠి వేడుకలు శనివారం అత్యంత వైభంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివార్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. స్వామివార్కి ఆలయ అర్చకులు మాచరి సూర్యనారాయణమూర్తి, రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుల్లేటికుర్రులో వేంచేసియున్న సుబ్రహ్మణేశ్వర స్వామి వార్కి సర్వేజన సుఖినోభవంతు ట్రస్ట్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. గంగలకుర్రు అగ్రహారం, ఇరుసుమండలో వేంచేసియున్న శ్రీవల్లీదేవసేన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి.

ఎమ్మెల్యే ఆనందరావు పూజలు
ఉప్పలగుప్తం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఎన్.కొత్తపల్లి, ఎస్.యానాం సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మండల బీసీ సెల్ అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ పూజల్లో పాల్గొన్నారు. ఎన్.కొత్తపల్లిలో అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఎస్.యానాంలో అయిదు రోజుల పాటు షష్ఠి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పినిశెట్టి నరసింహారావు తెలిపారు. సన్నవిల్లి, విలసవిల్లి, చల్లపల్లి, చినగాడవిల్లి, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, భీమనపల్లి గ్రామాల్లో షష్ఠి తీర్థం ఘనంగా నిర్వహించారు.

విద్యుత్ దీపాలతో ఆలయాలు అలంకరణ
కాట్రేనికోన, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి తీర్థం వైభవంగా జరిగింది. శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు తరలి వచ్చి సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. కాట్రేనికోన, చెయ్యేరు, కుండలేశ్వరం, కందికుప్ప, పల్లంకుర్రు, నడవపల్లి, లక్ష్మివాడ, చిర్రయానాం, బలుసుతిప్ప తదితర గ్రామాల్లో షష్ఠి తీర్థ వేడుకలు జరిగాయి.

జిల్లా నలుమూలల నుంచి భక్తులు
ఐ.పోలవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన గుత్తెనదీవి- వేమవరం షష్ఠి తీర్థం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఈనెల10వరకు షష్ఠి ఉత్సవాలు నిర్వహించనున్నారు. శనివారం భక్తులకు అన్నసమారాధన జరిగింది. బాలికల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నా యి. ఈనెల8న దేవనర్తకి రంగస్థల నాటకం, 9,10వ తేదీల్లో ఆర్కెస్ట్రాలు ఏర్పాటు చేశారు. రాత్రి జరిగే తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, మురమళ్ల, కొమరగిరి గ్రామాల్లో షష్ఠి తీర్థాలు జరిగాయి.

స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరి
అల్లవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల వద్ద శనివారం జరిగిన షష్ఠి తీర్థాలకు భక్తులు పోటెత్తారు. బోడసుకుర్రు, బెండమూర్లంక, గోడి, కొమరగిరిపట్నం, అల్లవరం గుడ్డివానిచింత వద్ద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల వద్ద షష్ఠి తీర్థాలు జరిగాయి. భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

మొండెపులంకలో కల్యాణం, తీర్థం
పి.గన్నవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొండెపులంక శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.శనివారం జరిగిన తీర్థమహోత్సవంలో స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. వై.కొత్తపల్లి, మానేపల్లి, పి.గన్నవరం, కుందాలపల్లి తదితర గ్రామాల్లో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిఆలయంలో పూజలు, అభిషేకాలు, తీర్థ మహోత్సవాలు జరిగాయి.

కడలిలో షష్ఠి ఉత్సవాలు
రాజోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కడలిలో శ్రీకపోతేశ్వరస్వామి దేవస్థానం శనివారం భక్తుల తాకిడితో కిక్కిరిసింది. తెల్లవారుజాము నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి క్యూలైన్లలో బారులు తీరారు. షష్ఠి వేడుకల్లో భాగంగా తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద నుంచి కడలి సెంటర్ వరకు భక్తులతో కోలాహలం నెలకొంది. స్వామివారిని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజల్లో జరిపించుకున్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, మానేపల్లి అయ్యాజీవేమా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు స్వామివారిని దర్శించుకున్నారు. షష్ఠి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో ఎం.సత్యనారాయణరాజు తగిన ఏర్పాట్లు చేశారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో వంద మందితో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, సర్పంచ్ చొప్పల గుణనాథ్, న్యాయవాది యాలంగి రమేష్, గాలిదేవర వెంకన్నబాబు, వడ్లమూడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాలల మహాసింహగర్జన సభను విజయవంతం చేయాలి
ముమ్మిడివరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈనెల15న జరిగే మాలల మహాసింహగర్జన సభకు పార్టీలకు అతీతంగా మాలలంతా కదిలి రావాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపునిచ్చింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో శనివారం నియోజకవర్గ మాల జేఏసీ కన్వీనర్ బి.జేమ్స్‌పాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సెక్రటరీ ఇసుకపట్ల రఘుబాబు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి విరుద్ధంగా వర్గీకరణ చేసేందుకు చేస్తున్న కుట్ర ప్రయత్నాలను తిప్పికొట్టి మాలల సత్తాను చాటేందుకు గ్రామగ్రామాన ఉన్న మాలలు, మాల అనుబంధ కులాలు తరలివచ్చి సింహగర్జన సభను జయప్రదం చేయాలన్నారు. కార్యదర్శి జంగా బాబూరావు మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాలను వర్గీకరణ పేరుతో విభజన కుట్రలను రాజ్యాంగం కల్పించిన హక్కులతో సాధించేందుకు మాల యువతీ యువకులు, మహిళలు, మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పార్టీలకు అతీతంగా తరలిరావాలన్నారు. సమావేశంలో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ముంగండ ఆశీర్వాదం, ఎస్.అబ్బులు, జనిపల్లి సత్యనారాయణ, మెండి కృష్ణంబాబు, కాశి జగపతి, అయితాబత్తుల శ్రీను, పండుబాబు, మోర్త శ్రీరామ్, బీరవెంకటేశ్వరరావులతో పాటు పలువురు పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

నాగసాధన
అమలాపురం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అమలాపురం విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలో సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని శ్రీ గౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో రవణం నరేంద్రకుమార్-కృష్ణవేణి దంపతులు నాగసాధన నిర్వహించారు. దశదిశలా నాగ ప్రతిష్ఠ, విశేష నాగపూజ, నాగసాధన నిర్వహించారు. కాలసర్ప, మహాసర్ప, సర్ప, నాగ, మానసాదేవి మంత్రాలను సాధకులు సామూహికంగా జరిపించారు. అక్షయపాత్ర, గోశాల సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ
ముమ్మిడివరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని వచ్చిన అవినీతి ఆరోపణపై శనివారం కూడా విచారణ నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్న వైద్యశాఖ వాట్సాప్ గ్రూపులో హల్‌చల్ చేయడంపై ప్రభుత్వం ఈసంఘటనపై విచారణకు ఆదేశించింది. విచారణాధికారిగా నియమించిన జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బీవీవీ సత్యనారాయణ శనివారం కూడా విచారణ నిర్వహించారు. శుక్రవారం విచారణకు హాజరు కాని ఐదుగురు పీహెచ్‌సీ వైద్యులు ఫిర్యాదుచేసిన మరో ఇద్దరు సీహెచ్‌వోలు, ఏడుగురు ఏఎన్ఎంలు విచారణకు హాజరై ప్రశ్నావళిలో లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. విచారణాధికారి సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ అవినీతి ఆరోపణలపై ఫిర్యాదుచేసిన 26మంది పీహెచ్‌సీ వైద్యులకు 25మంది ప్రశ్నావళి ద్వారా వివరణ తీసుకున్నామని, మరో ఇద్దరు సీహెచ్‌వోలు, ఏడుగురు ఏఎన్ఎం నుంచి ప్రశ్నావళిపై లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నామని, ఇంకా ఫిర్యాదుచేసిన వారిలో 9మంది విచారణకు హాజరుకావాల్సి ఉందన్నారు. విచారణకు హాజరైన వైద్య సిబ్బంది మీడియాతో మాట్లాడుతూ జిల్లావైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏపని చేయాలన్నా ఒక్కొక్క రేటుపెట్టారని, ఆ మొత్తం ఇస్తేగానీ ఫైల్ కదలడంలేదన్నారు.

మేనల్లుడిపై మేనమామ దాడి
ముమ్మిడివరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సైకిల్ విషయంలో మేనల్లుడికి మేనమామకు మాటామాటా పెరగడంతో మేనమామ కత్తితో దాడిచేసి గాయపర్చాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ మల్లాయిపాలెం జంగావారిపేటకు చెందిన పండు శ్రీనివాసరావు అతని మేనమామ కాట్రేనికోన మండలం చెయ్యేరు పంచాయతీ పరిధిలోని జయంతివారి పుంతకు చెందిన జి.కుటుంబరావు వద్ద శుక్రవారం సైకిల్ తీసుకున్నాడు. అయితే ఆ రోజు సైకిల్ తిరిగి ఇవ్వకపోవడంతో సైకిల్ ఏది అని నిలదీశాడు. తాను సరైన సమాధానం చెప్పకపోవడంతో తనను నానా దుర్భాషలాడాడని, తాను ఎదురు తిరగడంతో కత్తితో దాడిచేసి గాయపరిచి చంపుతానని భయపెట్టాడని, తనకు మేనమామ నుంచి రక్షణ కల్పించాలని శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

గ్రామాభివృద్ధికి పాటుపడాలి
ముమ్మిడివరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామాల్లో యువత గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూషన్ కార్లమెంట్ సిస్టర్స్ ఆఫ్ తెరిసా, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. మూడు రోజుల్లో నేర్చుకున్న విద్య, వైద్యం, కేంద్ర, రాష్ట్ర పథకాలు, మానవ హక్కులు, వినియోగదారుల హక్కులు, బాలబాలికల హక్కులు గురించి ప్రజలకు తెలియచేయాలన్నారు. శిక్షణ తీసుకున్న 40మంది యువతీ యువకులకు సర్టిఫికెట్లు అందించారు.న్యాయవాది వడ్డి నాగేశ్వరరావు, ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల కోఆర్డినేటర్ జి.కరుణాకరరావు, పీపుల్‌సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కన్నీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్వమానవాళి శాంతి కోసం ఐక్య క్రిస్మస్
మామిడికుదురు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని యునైటెడ్ క్రిస్టియన్స్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు శనివారం జరిగాయి. మామిడికుదురులోని పి.ప్రభుదాస్ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు సీహెచ్ స్టీఫెన్ మాట్లాడుతూ సర్వజనుల శ్రేయస్సు, ప్రాంతీయవాసుల రక్షణకు ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తుట్టు తెలిపారు. అనంతరం విశ్వమానవాళి శాంతి, భద్రత కోసం సేవకులు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ వి.ప్రతాప్, ట్రెజరర్ టి.నాని, ఎస్.ప్రసన్నకుమార్, ఎం.విజయ్‌కుమార్, కె.బాబూరావు, వైఎస్ టోని, బి.జోసెఫ్, పాస్టర్లు పాల్గొన్నారు.

వాటర్ డ్రోన్స్ ఏర్పాటుకు స్థలం సేకరించాలి
అంతర్వేది, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాటర్స్ డ్రోన్స్ ఏర్పాటుకు ఎకరం 80 సెంట్ల స్థలాన్ని సేకరించాలని సఖినేటిపల్లి రెవెన్యూ అధికారులను అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశించారు. సఖినేటిపల్లిరేవు, అంతర్వేది వశిష్ఠరేవులను ఆర్డీవో శనివారం పరిశీలించారు. స్థల సేకరణ కోసం అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, వీఆర్వోలు, అధికారులు పాల్గొన్నారు.

యువజన ఉత్సవంలో నవోదయ విద్యార్థుల ప్రతిభ
యానాం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యానాం నెహ్రూ యువ కేంద్రం నిర్వహించిన యువజన ఉత్సవంలో యానాం జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వ్యక్తిగత సైన్సువిభాగంలో 12వతరగతి చదువుతోన్న దివ్యాన్సు ప్రథమ బహుమతి, గొల్లకోటి రమ్య, ఎర్రమశెట్టి యోగలక్ష్మి, పోలిశెట్టి భార్గవి, ఏంజెల్‌లు ద్వితీయ బహుమతి, యంగ్ ఆర్టిస్టు విభాగంలో ఎం.అశోక్‌వర్మ ద్వితీయ బహుమతి సాధించారు. విజేతలను ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి అభినందించారు. వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. భారతప్రభుత్వ జాతీయ శక్తి పరిరక్షణ విభాగంలో పుదుచ్చేరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో 8వ తరగతి చదువుతోన్న మల్లాడి రితిక నగదు బహుమతి సాధించింది.

బాలిక కిడ్నాప్ కేసులో చర్యలు తీసుకోవాలి
మలికిపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బాలికను కిడ్నాప్ చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, బాలికలను సంరక్షించాలని పలు ప్రజా సంఘాలు డిమాండు చేశాయి. బాలిక అదృశ్యంపై పాఠశాల వద్ద నిజ నిర్ధారణ చేయడం జరిగిందని, బాలికకు పరిచయస్తురాలైన మహిళ ఉద్దేశ పూర్వకంగా బాలికను నమ్మించి ఉపాధ్యాయులను మోసంచేసి అపహరించినట్టు తేలిందన్నారు. ఈకేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక జిల్లా కార్యవర్గసభ్యుడు ముత్యాల శ్రీనివాసరావు, నల్లి ప్రసాద్, మందా సత్యనారాయణ, మోకా శ్రీను డిమాండు చేశారు.

వక్ఫ్‌బోర్డు సభ్యుడు హుస్సేన్‌కు అభినందనలు
మామిడికుదురు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):వక్ఫ్‌బోర్డు సభ్యుడిగా నియమితులైన హాజీముఖర్రం హుస్సేన్‌ను పలువురు అభినందించారు. జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ముఖర్రంను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ముఖర్రం శనివారం జడ్పీ మాజీ చైర్మన్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని తనకు పదవి రావడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి ఆయన్ను పూలమాలలతో సన్మానించారు. జాలెం సుబ్బారావు, కొల్లాబత్తుల వెంకటరమణ, కుసుమ సువర్ణబాబు, ఫర్హత్‌అలీబేగ్ అభినందించారు.

మండపేట



మండపేటలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వేగుళ్ల. పక్క చిత్రంలో ఆలమూరు మండలం పెదపళ్లలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి

• తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు
• ప్రత్యేక పూజలు, అభిషేకాలు • వేదమంత్రాలతో కల్యాణాలు



కొత్తపేట వాడపాలెంలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

ద్రాక్షారామ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు క్షీరాభిషేకం నిర్వహించి, పూలు, పడగలు సమర్పించారు. శనివారం రాత్రి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని జరిపారు. దేవులపల్లి ఫణి రామకృష్ణ యాజ్ఞికత్వంలో కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో చేశారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. మండలంలో నరసాపురపుపేట, హసన్‌బాద, వెల్ల, యనమదల తదితర గ్రామాల్లో షష్ఠి వేడుకలు జరిగాయి. హసన్‌బాదలో శుక్రవారం రాత్రి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకుడు ఉండి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో జరిపారు. నరసాపురపుపేటలో శనివారం రాత్రి కల్యాణాన్ని వైభవంగా జరిపారు.

మంత్రి సుభాష్ పూజలు: నరసాపురపుపేటలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మంత్రి సుభాష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.

హసన్‌బాదలో రథోత్సవం: మండలంలోని హసన్‌బాదలో సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని స్వామి వారి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో మంత్రి సుభాష్, సర్పంచ్ ఎస్.సతీష్‌రావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు అన్నసమారాధన జరిపారు.

రామచంద్రపురంలో: పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుతీరారు. స్వామివారికి పూజలు జరిపారు. ఆలయ ఈవో లక్ష్మణరావు పర్యవేక్షణలో షష్ఠి వేడుకలు జరిగాయి. రామచంద్రపురం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మండపేట: సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని ఏడిద సంఘమేశ్వరం, మండపేట రథం గుడిలోనున్న సుబ్రహ్మణ్యస్వామిని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఏడిద సంఘమేశ్వరంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. సంఘమేశ్వరంలో మండపేట రూరల్ సీఐ దొర్రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మండపేట రథం గుడి వద్ద ఆలయ అర్చకులు సోమనాథం భక్తులకు అన్న సమారాధన చేశారు. మండపేట మండలం ఏడిద, ఆర్తమూరు, మండపేట తదితర ప్రాంతాల్లో షష్ఠి వేడుకలు వైభవంగా జరిగాయి.

రాయవరం: వెదురుపాక విజయదుర్గాపీఠంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అభిషేకాలు, అర్చనలు జరిపారు. పసలపూడిలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచే అభిషేకాలు, అర్చనలు, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించడంతోపాటు రజత కవచం అలంకరించారు. సోమేశ్వరం బాల త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. రాయవరం రాజరాజేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు విలపర్తి ఫణిధర్ శర్మ, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. మండలంలోని వెదురుపాక, లొల్ల, చెల్లూరు , వెంటూరు గ్రామాల్లో భక్తులు షష్ఠి పూజలు చేశారు. వేకువజాము నుంచే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు కిటకిటలాడాయి.



కపిలేశ్వరపురం: అంగరలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, వల్లూరు, నేలటూరు, కోరుమిల్లి తదితర గ్రామాల్లో షష్ఠి వేడుకలు జరిగాయి. భక్తులు ఆయా ఆలయాల వద్ద దర్శనానికి బారులు తీరారు. నేలటూరు నీలాంబిక సమేత బసవేశ్వర స్వామి ఆలయం వద్ద షష్ఠి వేడుకలు జరిగాయి. అంగరలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీరామ బాలభక్త భజన సమాజం వారిచే భజన, చిన్నారులతో భరతనాట్యం, రాత్రి బాణసంచా కాల్పులు నిర్వహించారు. ఆలయం వద్ద అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అంగర ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



రాయవరం: పసలపూడిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

ఆలమూరు: మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివారికి పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలమూరు, చింతలూరు, మడికి, చెముడులంక, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, నర్సిపూడి, నవాబుపేట, మోదుకూరు, గుమ్మిలేరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, పెనికేరు, కలవచర్ల గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. తెల్లవారుజాము నుంచే ఆయా ఆలయాల్లో భక్తులు బారులుతీరారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. వెండిపుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. వాడపల్లిలో పురాతన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పాలాభిషేకం జరిపారు. పేరవరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

కె.గంగవరం: మండలంలో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు జరిగాయి. వేకువజాము నుంచే భక్తులు ఆయా ఆలయాల్లో పూజలు, అభిషేకాలు చేశారు. మండలంలోని యండగండి, పామర్రు, దంగేరు తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కొత్తపేట: మండలంలో శనివారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలను ఘనంగా జరిపారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాల్లో సందడి చేశారు. వాడపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. కొత్తపేటలోని హరిహర దేవాలయ ప్రాంగణంలో గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని, శనేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగేశ్వరస్వామిని, పలివెల శ్రీ ఉమాకొప్పిలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్తపేట, వాడపాలెంలో షష్ఠిని పురస్కరించుకుని తీర్థాలు జరిగాయి.

రావులపాలెం: మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో షష్ఠి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు.

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు



కొత్తపేట శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామి వారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,12,136 ఒకరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టారు.

కేశవస్వామి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బెంగళూరుకు చెందిన శ్రీసాయివనం ఫౌండేషన్ అధినేత ఏ.సుబ్బారావు, లక్ష్మిఅపారజిత దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.25,116 విరాళం అందించారు. విజయనగరానికి చెందిన తిరుమల హాస్పటల్స్ అధినేత ప్రసాద్, శాంతి దంపతులు రూ.10,116 విరాళాలు అందించారు. ఆలయ ఈవో రమణమూర్తి దాతలకు స్వామి వారి చిత్రపటం అందించారు.



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు

మండపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) మండపేట కేపీ రోడ్డులోనున్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు పెదబాబు, చినబాబు ప్రత్యేక పూజలు చేశారు.



దుర్గాపీఠంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం

కపిలేశ్వరపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం దుర్గాపీఠంలో పీఠాధిపతి భాస్కరస్వామిజీ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని శనివారం సుబ్రహ్మణ్యస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, పాశుపత హోమం జరిపారు. ఈసందర్భంగా పురోహితులు మల్లేశ్వరశర్మ, మాగాపు భద్రశర్మ, ప్రసాద్, దత్తాత్రేయశర్మలు సుబ్రహ్మణ్యస్వామికి లక్షపుష్పార్చన, పాశుపత హోమం, ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. శివుడికి ఏకాదశ రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



అవార్డు స్వీకరిస్తున్న జయప్రకాష్ నారాయణ

జేపీకి ఉత్తమ సేవారత్న పురస్కారం

ఆలమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారానికి చెందిన సలాది జయప్రకాష్ నారాయణకు జాతీయ ఉత్తమ సేవారత్న అవార్డు అందించారు. జాతీయ వలంటీర్స్ డే సందర్భంగా పాన్ ఇండియా సోషల్ కల్చరల్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డుకు ఆయన్ను ఎంపిక చేశారు. విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఏపీ మీడియా అకాడమి మాజీ కార్యదర్శి ఎం.బాల గంగాధర్ తిలక్, పాన్ ఇండియా అధినేత అద్దంకి రాజాతోపాటు పలువురు నుంచి ఆయనకు అవార్డు అందించారు.

నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో ఆదివారం షిర్డీసాయి ఉచిత హోమియో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ చేకూరి పాపారావు తెలిపారు. ముచ్చుమిల్లి రోడ్డులో లయన్ జీవీ రావు ఏబీసీ మోడరన్ ప్రైమరీ పాఠశాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు వైద్య సేవలందిస్తామన్నారు. శిబిరంలో మందులు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు.



విజిలెన్స్ ఎస్పీకి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయంలో విజిలెన్స్ ఎస్పీ పూజలు

ఆత్రేయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎం.స్నేహిత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. వేద పండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆమెకు ఉప కమిషనరు చక్రధరరావు స్వామివారి చిత్రపటం అందించారు.



రావులపాలెం జడ్పీ పాఠశాలల వద్ద ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు. పక్క చిత్రంలో రామచంద్రపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల

విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం పెద్దపీట

పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం జడ్పీ పాఠశాలల క్రీడా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ కమిటీ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రామకృష్ణ, గొలగోరి వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాల్లో పేరెంట్స్ సమావేశాలు జరిపారు. ప్రాథమిక, జడ్పీ హైస్కూళ్లు, ఎయిడెడ్ పాఠశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకట్రావు, ఎంపీడీవో వెంకటరామన్, ఎంఈవోలు వరప్రసాద్, సాహెబ్ తదితరులు విద్యార్థుల తల్లిదండ్రులతో సహపంక్తి భోజనాలు చేశారు.



కొత్తపేట జడ్పీ బాలకోన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కొత్తపేట ఆర్డీవో శ్రీకర్

పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలి

కొత్తపేట: చదువుకునే పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించి వారు ఎలా చదువుతున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అన్నారు. శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆర్డీవో పి.శ్రీకర్ పాల్గొన్నారు. తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, నేలపూడి సత్యనారాయణ, బండారు భాను, పంచాయతీ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ డే సమావేశం జరిపారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పర్చాలన్న లక్ష్యంతో దీన్ని నిర్వహించినట్టు ఎంఈవో కె.తాతారావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో తల్లులకు రంగోళి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. అనంతరం వారంతా మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు సంబంధించిన హోలిస్టిక్ కార్డులను తల్లిదండ్రులకు అందించారు. ఈ కార్యక్రమాల్లో డీఎల్‌డీవో కామేశ్వరరావు, ఎంపీడీవో రత్నకుమారి, ఏవో రాజేంద్రప్రసాద్, తహశీల్దార్ పి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేయాలి

ఆలమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు, పేరెంట్స్ సమష్టిగా కృషి చేయాలని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ టీచర్ల సమావేశాలు జరిపారు. ఆలమూరు జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఎంపీడీవో రాజుతోపాటు ఎంఈవో సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలంలో శనివారం మెగా పేరెంట్స్‌డే ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో జరిగింది. వెల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.వీరభద్రరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్ సుంకర ఆదినారాయణ, వైస్ చైర్మన్ పందిరి శాంతికుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ద్రాక్షారామ, నరసాపురపుపేట, హసన్‌బాద జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే సమావేశాలు ఆయా పాఠశాలల హెచ్‌ఎం అధ్యక్షతన జరిగాయి. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

మండపేట: ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన కార్యక్రమంలో సందడి నెలకొంది. మండలంలోని 69 పాఠశాలల్లో మెగా పేరేంట్స్ సమావేశాలు జరిపారు. తాపేశ్వరం, మండ పేట ప్రభుత్వ బాలికల హైస్కూల్లో ఉచిత మెగా వైద్య శిబిరాలను నిర్వహించారు. విద్యార్థినులకు జరిపిన రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతోపాటు మండల విద్యాశాఖాధికారులు ఎస్.రామచంద్రరావు, సోమిరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. రాయవరంలో హెచ్‌ఎం శాంతి సునీత ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భోజనం చేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంవో పిల్లి రాంబాబు, ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, ఆయా పాఠశాలల పీఎంసీ చైర్మన్‌లు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కృషితో విద్యా ప్రమాణాలు పెంపు

ఆర్డీవో అఖిల

రామచంద్రపురం(ద్రాక్షారామ): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపునకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంయుక్తంగా కృషి చేయాలని ఆర్డీవో దేవరకొండ అఖిల పిలుపునిచ్చారు. శనివారం రామచంద్రపురంలో రత్నంపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విత్తనాల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఏఎంవో పిల్లి రాంబాబు ప్రసంగించారు. పాఠశాల హెచ్‌ఎం విత్తనాల సుబ్బారావు పాఠశాల ప్రగతిని తెలిపారు. సమావేశంలో ఎంఈవో శ్రీనివాస్, నాగేశ్వరి, మున్సిపల్ మేనేజరు పి.శ్రీరామచంద్రమూర్తి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. తోటవారి వీధిలో బాలికోన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే జరిగింది. హెచ్‌ఎం ఏవీ ఆచార్యులు, ఎస్ఎంసీ చైర్మన్ ఖండవిల్లి విజయరాజ్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే హెచ్‌ఎం వీరరాఘవరెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా డీఎస్పీ బి.రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ చైర్మన్ గంగరాజు పాల్గొన్నారు. పట్టణంలో పిల్లావారి వీధి, చింతపల్లి సూరన్న నగర్, జడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మెగా పెరెంట్స్ డే జరిపారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు

క్రీస్తు జీవితం మానవాళికి ఆదర్శనీయం

కపిలేశ్వరపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): క్రీస్తు జీవితం మానవాళికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శనివారం కపిలేశ్వరపురంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ ఆరాధనలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పలువురు క్రిస్మస్ సందేశాన్ని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ళను, సర్పంచ్ శ్రీనివాస్‌ను, తహశీల్దార్ చిన్నారావును పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శాలువా కప్పి జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ జి.రూబెన్, గౌరవ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ కె.ఏసురత్నం తదితరులతో పాటు క్రీస్తు ఆరాధకులు పాల్గొన్నారు.

గోవిందరాజుకు అవార్డు పట్ల హర్షం

కె.గంగవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు పండు గోవిందరాజుకు అరుదైన గౌరవం దక్కింది. కౌన్సిల్ ఆఫ్ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్‌తో పాటు, దేశంలోని పెట్టుబడి సంస్థలు అత్యుత్తమ పారిశ్రామిక వేత్తగా గుర్తించారు. ఈ మేరకు ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. అస్సాం అగ్రికల్చర్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేశారు. ఆయన్ను ఎంపీపీ పంపన నాగమణి, మాజీ ఎంపీపీలు వి.సూర్యచంద్రరాజశేఖర్, పి.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



గౌహతీలో అవార్డు అందుకున్న గోవిందరాజు

మేనల్లుడిపై మేనమామ దాడి

ముమ్మిడివరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సైకిల్ విషయంలో మేనల్లుడికి మేనమామకు మాటామాటా పెరగడంతో మేనమామ కత్తితో దాడిచేసి గాయపర్చాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ మల్లాయిపాలెం జంగావారిపేటకు చెందిన పండు శ్రీనివాసరావు అతని మేనమామ కాట్రేనికోన మండలం చెయ్యేరు పంచాయతీ పరిధిలోని జయంతివారి పుంతకు చెందిన జి.కుటుంబరావు వద్ద శుక్రవారం సైకిల్ తీసుకున్నాడు. అయితే ఆ రోజు సైకిల్ తిరిగి ఇవ్వకపోవడంతో సైకిల్ ఏది అని నిలదీశాడు. తాను సరైన సమాధానం చెప్పకపోవడంతో తనను నానా దుర్భాషలాడాడని, తాను ఎదురు తిరగడంతో కత్తితో దాడిచేసి గాయపరిచి చంపుతానని భయపెట్టాడని, తనకు మేనమామ నుంచి రక్షణ కల్పించాలని శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

అవినీతి ఆరోపణలపై కొనసాగుతున్న విచారణ

ముమ్మిడివరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని వచ్చిన అవినీతి ఆరోపణపై శనివారం కూడా విచారణ నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్న వైద్యశాఖ వాట్సాప్ గ్రూపులో హల్‌చల్ చేయడంపై ప్రభుత్వం ఈసంఘటనపై విచారణకు ఆదేశించింది. విచారణాధికారిగా నియమించిన జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బీవీవీ సత్యనారాయణ శనివారం కూడా విచారణ నిర్వహించారు. శుక్రవారం విచారణకు హాజరు కాని ఐదుగురు పీహెచ్‌సీ వైద్యులు ఫిర్యాదుచేసిన మరో ఇద్దరు సీహెచ్‌వోలు, ఏడుగురు ఏఎన్ఎంలు విచారణకు హాజరై ప్రశ్నావళిలో లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. విచారణాధికారి సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ అవినీతి ఆరోపణలపై ఫిర్యాదుచేసిన 26మంది పీహెచ్‌సీ వైద్యులకు 25మంది ప్రశ్నావళి ద్వారా వివరణ తీసుకున్నామని, మరో ఇద్దరు సీహెచ్‌వోలు, ఏడుగురు ఏఎన్ఎం నుంచి ప్రశ్నావళిపై లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నామని, ఇంకా ఫిర్యాదుచేసిన వారిలో 9మంది విచారణకు హాజరుకావాల్సి ఉందన్నారు. విచారణకు హాజరైన వైద్య సిబ్బంది మీడియాతో మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏపని చేయాలన్నా ఒక్కొక్క రేటుపెట్టారని, ఆ మొత్తం ఇస్తేగాని ఫైల్ కదలడంలేదన్నారు.

మాలల మహాసింహగర్జన సభను విజయవంతం చేయాలి

ముమ్మిడివరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈనెల15న జరిగే మాలల మహాసింహగర్జన సభకు పార్టీలకు అతీతంగా మాలలంతా కదిలి రావాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపునిచ్చింది. ముమ్మడివరం నగర పంచాయతీ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో శనివారం నియోజకవర్గ మాల జేఏసీ కన్వీనర్ బి.జేమ్స్‌పాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సెక్రటరీ ఇసుకపట్ల రఘుబాబు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి విరుద్ధంగా వర్గీకరణ చేసేందుకు చేస్తున్న కుట్ర ప్రయత్నాలను తిప్పికొట్టి మాలల సత్తాను చాటేందుకు గ్రామగ్రామాన ఉన్న మాలలు, మాల అనుబంధ కులాలు తరలివచ్చి సింహగర్జన సభను జయప్రదం చేయాలన్నారు. కార్యదర్శి జంగా బాబూరావు మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాలను వర్గీకరణ పేరుతో విభజన కుట్రలను రాజ్యాంగం కల్పించిన హక్కులతో సాధించేందుకు మాల యువతీ యువకులు, మహిళలు, మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పార్టీలకు అతీతంగా తరలిరావాలన్నారు. సమావేశంలో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ముంగండ ఆశీర్వాదం, ఎన్.అబ్బులు, జనిపల్లి సత్యనారాయణ, మెండి కృష్ణంబాబు, కాశి జగపతి, అయితాబత్తుల శ్రీను, పండుబాబు, మోర్త శ్రీరామ్, బీరవెంకటేశ్వరరావులతో పాటు పలువురు పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.